ప్రజాశక్తి
బుధవారం 4 జనవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ.. అదానీకి అప్పగింత

- మధురవాడలో రూ.4 వేల కోట్ల విలువచేసే 130 ఎకరాలు కేటాయింపు
- మొన్న గంగవరంలో పోర్టు, నిన్న ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టులు ధారాదత్తం
- కేటాయింపులను తక్షణం రద్దుచేయాలి : మాజీ ఐఎఎస్ ఇఎఎస్.శర్మ డిమాండ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నేలపై భారత దిగ్గజ కార్పొరేట్ అదానీ అడుగుమోపి ఆక్రమించుకోడానికి సిద్ధమైపోయాడు. భారీ ప్రాజెక్టుల పేరుతో భూములను కైవసం చేసుకునే దిశగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం సహకారాన్ని కొనసాగిస్తోంది. దేశ స్థాయిలో బిజెపి, రాష్ట్ర స్థాయిలో వైసిపి సర్కార్లు.. అదానీకి జీ హుజూర్ అంటున్నాయి. విశాఖ నేలనంతటినీ అదానీ పాదాక్రాంతం చేసుకునే దిశగా ఫైళ్లు కదిలిపోతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, వందిమాగదలంతా విశాఖను ఎపి కేపిటల్‌గా తమ ప్రభుత్వం నిర్ణయించాక ఒక్క గజం భూమి కూడా ఆక్రమణ కాకుండా చూస్తామంటూ ప్రగల్భాలు పలికిన సంగతి తెలిసిందే. ఆచరణ మాత్రం తద్విరుద్ధంగా సాగడంతో విశాఖలో అదానీ భూ భాగోతంపై చర్చ సాగుతోంది. మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాస్తూ... జాతీయ స్థాయిలో నిర్మించుకున్న చట్టాలన్నింటినీ ఉల్లంఘిస్తూ ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టులు, మధురవాడలో వేల కోట్ల రూపాయలు విలువ చేసే భూములను అదానీకి కట్టబెట్టడాన్ని తప్పుబట్టారు. కారుచౌకగా భూముల లీజుల వ్యవహారం నడిపిన వైనంపై మండిపడ్డారు. తక్షణం అదానీ ప్రాజెక్టులను రద్దుచేయాలని లేఖలో పేర్కొన్నారు.



పక్కా ఏర్పాట్లతో సాగుతున్న జగన్ ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టులో తన 10.5 శాతం ఈక్విటీ వాటాను అత్యంత వ్యూహాత్మకంగా అదానీ గ్రూపునకు అప్పగించడం రాష్ట్ర ఖజానాకు భారీ గండికొట్టడం తప్ప మరొకటి కాదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్రం తీసుకున్న విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టులో మాదిరిగానే కేంద్రంతో చేతులు కలిపేసి ఈ ప్లాంట్‌ను కూడా కట్టబెట్టే కుట్రకు పాల్పడడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖలో బిజెపి నేత జివిఎల్.నరసింహారావు పనిగట్టుకుని ఇక్కడే తిష్టవేసి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్న వాదనలకు బలం చేకూరేలాగ రాష్ట్ర ప్రభుత్వం అదానీ అడుగులకు మడుగులొత్తడం తెరవెనుక జరిగిపోతోంది. ఉత్తరాంధ్రలో ప్రజల స్టీల్‌ప్లాంట్ సెంటుమెంట్ బలంగా ఉండడంతో కార్మికులతో కలసి ప్రజలూ ప్లాంట్ రక్షణ కోసం మిగతా 2లో..

అమ్మో.. మూడో తేదీ దాటింది..!

- ఉద్యోగులకు పడని జీతాలు
- పింఛన్‌దారులదీ ఇదే పరిస్థితి
- రూ.120 కోట్లలో రెండు శాఖల ఉద్యోగులకు రూ.28 కోట్లు చెల్లింపు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కొత్త సంవత్సరం నుంచైనా వేతనాలు ఒకటో తేదీన ప్రభుత్వం వేస్తుందనుకొనే ఉద్యోగులకు నిరాశ ఎదురైంది. మూడో తేదీ వచ్చినా వేతనాలు పడలేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. సెల్ మెసేజ్‌లు రాక, ఎటిఎమ్‌లకు వెళ్లి తమ బ్యాంకు ఖాతాలు చూసుకున్నారు. జీతాలుపడలేదని అసంతృప్తితో వెనుదిరిగారు. గృహ, ఇతర బ్యాంకు రుణాలు గడువులోగా చెల్లించకపోతే వడ్డీ భారం ఎక్కువ అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతాలొస్తే అప్పులు తీర్చుకుందామనుకొనే ఉద్యోగులు జీతాలు పడక అవస్థలుపడుతున్నారు. జిల్లాలో 43 ప్రభుత్వ శాఖల ఉద్యోగులు దాదాపు 14,558 మంది వున్నారు. వీరికి ప్రతినెలా రూ.120 కోట్లును జీతాల మిగతా 2లో..

పింఛన్ పెంపు పేరిట మోసం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్



ప్రజాశక్తి - కలెక్టరేట్ : వృద్ధులకు, వితంతువులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను తాను అధికారంలోకి వస్తే రూ.3 వేలకు పెంచి ఇస్తానని చెప్పిన సిఎం జగన్ మోహన్ రెడ్డి దాదాపు నాలుగేళ్లపాటు రూ.3 వేలు పెన్షన్ ఇవ్వకుండా దశలవారీగా పెంచుతున్నట్లు చెప్పి మోసగించారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ విమర్శించారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రూ.250 పెంచుతూ పింఛను రూ.2750 ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. మార్కెట్లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ ఎన్నోరెట్లు పెరిగాయని, పెన్షన్ పెంపుదల ఉన్నప్పటికీ అది ఏమాత్రమూ సరిపోదని అన్నారు. ధరలను అదుపు చేయడం చేతకాక ప్రజలను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు జగన్ గురి చేశారని మండిపడ్డారు. 2014లో మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం

వార్త 2లో..

ఎన్ఎబిబి ఎస్‌డిసిగా జ్ఞానవేణి

వార్త 2లో..

పవన్ ప్యాకేజీ స్టార్ : మంత్రి అమర్

వార్త 2లో..

పలువురు జెడ్‌సిల బదిలీ

నగర పాలన ప్రక్షాళన దిశగా కమిషనర్ రాజాబాబు అడుగులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో :

జివిఎంసి కొత్త కమిషనర్ రాజాబాబు నగర పాలనపై పట్టు సాధించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. పలు వార్డులలో క్షేత్రస్థాయి పాలనకు కేంద్ర బిందువులుగా ఉన్న జోనల్ కమిషనర్ల బదిలీకి శ్రీకారం చుట్టి పాలనను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. జివిఎంసిలో పలువురు జోనల్ కమిషనర్లకు బదిలీలు జరిగాయి. కొంతమంది మాత్రం యథాతథంగానే అదే జోన్లలో జోనల్ కమిషనర్లుగా కొనసాగేలా రాజాబాబు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ 1 భీమిలి జోనల్ కమిషనర్ ఎస్‌వి.రమణను జోన్ 7 అనకాపల్లికి బదిలీ చేస్తూ, అనకాపల్లి జూన్ 7లో జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కనకమహాలక్ష్మిని మధురవాడ జోన్ 2 జోనల్ కమిషనర్‌గా నియమించారు. మధురవాడ జోన్ 2 జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.రామును జోన్ 1 భీమిలి రమణ స్థానంలో జోనల్ కమిషనర్‌గా నియమించారు. జోన్ 3 ఆశీల్‌మెట్ట జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మిని యథాతథంగా మళ్ళీ జోనల్ కమిషనర్‌గా అక్కడే కొనసాగించారు. ఆమె ఇటీవలే జోన్ 8 పెందుర్తి జోనల్ కమిషనర్‌గా ఉంటూ జోన్ 3కి జోనల్ కమిషనర్‌గా పలువురు రాజకీయ సిఫార్సులతో వచ్చారని విస్తృత ప్రచారం జరిగింది. ప్రస్తుత బదిలీల్లో విజయలక్ష్మిని అదే జోన్‌లో కొనసాగించడానికి తూర్పు నియోజకవర్గం నేత క్రియాశీలకంగా వ్యవహరించినట్లు విస్తృత ప్రచారం సాగింది. ఏ జోన్‌లో జోన్ల కమిషనర్‌గా ఉన్నా వివాదాల్లో ఉద్యోగుల నుంచే విమర్శలు ఎదుర్కొంటున్న జోన్ 4 సూర్య బాగ్ జోనల్ కమిషనర్ చక్రవర్తిని పూర్తిగా జోనల్ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి ప్రధాన కార్యాలయంలో యుసిడి విభాగంలో డిపిఒగా నియమించారు. డిపిఒగా పనిచేస్తున్న పి.శివప్రసాద్‌ను జోన్ 4 జోనల్ కమిషనర్‌గా నియమించారు. ఇక జోన్ 5 జ్ఞానాపురం మిగతా 2లో..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జిల్లాలో పెన్షన్ కానుక ద్వారా 1,60,114 మందికి లబ్ధి
- విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పారదర్శకమైన పాలనతో జిల్లాలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మంగళవారం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,60,114 మందికి రూ.44.98 కోట్ల రూపాయలు పెన్షన్ కానుక ద్వారా అందుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ రూ.2,500ను ఈ నెల నుంచి రూ.2,750కు పెంచినట్టు తెలిపారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ద్వారా అర్హతనే ప్రామాణికంగా తీసుకొని సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జిల్లా పరిషత్



పెన్షన్ కానుక చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ పాలన వల్ల లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. గతంలో లబ్ధిదారులకు ప్రజాప్రతినిధుల సిఫార్సులు ఉంటే తప్ప సంక్షేమ పథకాలు అందేవి కాదని చెప్పారు. ఈ ప్రభుత్వం పేదరికాన్ని అర్హతగా తీసుకొని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు మిగతా 2లో..

పవన్ ప్యాకేజీ స్టార్ : మంత్రి అమర్

సుగర్ ఫ్యాక్టరీలను నాశనం చేసింది చంద్రబాబే

ప్రజాశక్తి - అనకాపల్లి : పవన్ కల్యాణ్ సినిమాల్లో పవర్ స్టార్, రాజకీయాల్లో ప్యాకేజీ స్టార్ అని, 'సిఎం పవన్ కల్యాణ్' పేరుతో ఎవరైనా సినిమా తీస్తే తాను ప్రొడ్యూస్ చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. మండలంలోని తుమ్మపాల బంగారు రాజు కల్యాణ మండపంలో మంగళవారం పాత పింఛన్లు, నూతన పింఛన్లను ఎంపీ సత్యవతితో కలిసి ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రానున్న ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి ఆఖరివన్నారు. పవన్ కల్యాణ్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనని ఒకసారి, చీలుస్తానని ఒకసారి చెప్పడాన్ని బట్టి చూస్తే రాజకీయాల్లో ఎటువైపు వెళ్ళాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నట్టు స్పష్టమవుతోందన్నారు. పవన్ కల్యాణ్ సభకు వచ్చేవారంతా సిఎం పవన్.. సిఎం పవన్ అంటున్నారని, ఆయనకు సిఎం అయ్యే అవకాశం లేనందున ఎవరైనా సిఎం పవన్ కల్యాణ్ పేరుతో సినిమా తీస్తే తాను నిర్మాణ బాధ్యత వహిస్తామని సెటైర్ విసిరారు. ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అని ఆయనతో పొత్తు పెట్టుకున్న పార్టీలు చెప్పగలవా ? అని ప్రశ్నించారు. ఇక చంద్రబాబు విషయానికి వస్తే ఆయన హయాంలో మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తండ్రి రాజశేఖర్ రెడ్డి తెరిపించిన విషయాన్ని గుర్తు చేస్తారు. తుమ్మపాల ఫ్యాక్టరీని చెరుకు సంబంధిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆలోచిస్తున్నారన్నారు. ఇక భూములను కబ్జా చేసే నైజం తనది కాదని, కనీసం సెంటీమీటర్ భూమి కూడా కబ్జా చేసే అవకాశం లేకుండా చూస్తామని అన్నారు. చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలను, రైతులను రుణమాఫీ చేస్తామని మోసగించారన్నారు. బొజ్జన్న కొండ రోడ్డు అభివృద్ధికి కోటి రూపాయలు ఖర్చు చేయనున్నామని, అలాగే ఆ ప్రాంతంలో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, ఎంపిపి సూరిబాబు, వైస్ ఎంపిపిలు సూర్య కుమారి, ఆనంద రాము, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ జోసెఫ్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ గాంధీ, ఎంపిటిసిలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, చంటి, వడ్డాది భారతి అశోక్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

విశాఖ.. అదానీకి అప్పగింత

నడుం బిగించడానికి సిద్ధమవ్వడం చెప్పుకోదగ్గ విషయం.

అదానీ గ్రూపు పరం కానున్న రూ.4 వేల కోట్ల విలువైన 130 ఎకరాలు

విశాఖకు రాజధానిగనక వస్తే.. కీలక ప్రాంతంగా మారే మధురవాడ పరిధిలోగల శ్రీరాం ప్రాపర్టీస్ ఏరియాలోని మిధునాపురి కాలనీలోని సర్వే నెంబరు 409లోని 130 ఎకరాల్లో అదానీ గ్రూపు డేటా అనలిటిక్స్ సెంటర్ శంకుస్థాపన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భూమిని కూడా దఖలు పరిచింది. సుమారు రూ.4 వేల కోట్ల విలువైన భూమిగా ఇది ఉంది. లీజు వ్యవహారంలోనూ లాలూచీ వెల్లడవుతోంది. లీజు అద్దె ఆ భూమి మార్కెట్ విలువలో 10 శాతం కంటే తక్కువ ఉండకూడదు. దీని ప్రకారం ఆ భూమికి ఏటా రూ.400 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.130 కోట్లకే కట్టబెట్టడం గమనార్హం.

న్యాయ కమిషన్ విచారణ చేయాల్సిందే : ఇఎఎస్.శర్మ

సహజ వనరులను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించే విషయంలో పారదర్శకత అవసరమని సుప్రీం కోర్టు పదేపదే నొక్కి చెప్పిందని మాజీ ఐఎఎస్ ఇఎఎస్.శర్మ మంగళవారం ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. తాజా కేటాయింపులు పూర్తిగా నేరపూరితంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. గతంలో కృష్ణపట్నం పోర్టునూ అదానీకి ఇలాగే కట్టబెట్టిందని పేర్కొన్నారు. తాజాగా మధురవాడలో భూ కేటాయింపుల విషయంలో నిబంధనలను ఉల్లంఘించారని, ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టును అదానీకి అప్పగించడం తగదని అన్నారు. గిరిజనుల మనోభావాలను, విశాఖ ప్రజల సెంటిమెంట్లను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. 2012 సెప్టెంబర్ 14న విడుదల చేసిన జిఒఎంఎస్ నెంబరు 571 ప్రకారం నోటిపై చేసిన భూ వినియోగ విధానం ప్రకారం ప్రజా ప్రయోజనం కోసం ప్రైవేట్ ఏజెన్సీలకు లీజుకు ఇచ్చిన భూమికి సంవత్సరానికి దాని మార్కెట్ విలువలో 10 శాతం కంటే తక్కువకు లీజుకివ్వకూడదు అని లేఖలో శర్మ కోట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల్లో తన విశ్వసనీయతను కాపాడుకోవాలని ఆయన హితవుపలికారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన కేటాయింపులపై న్యాయ కమిషన్ విచారణ జరపాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వివరించారు. వియంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలంలో పెన్షన్ల వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేరువలో ఉంటూ పాలన సాగిస్తోందన్నారు. సిఎం రాజమండ్రిలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం రూ.44.98 కోట్లను మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి ఫించనుదారులకు అందజేశారు. కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ రాజాబాబు, శాసనమండలి సభ్యులు పండుల రవీంద్రబాబు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి అధికారి పూర్ణిమా దేవి, డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, వార్డు కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, పింఛనుదారులు పాల్గొన్నారు.

పలువురు జెడ్‌సిల బదిలీ

జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణారావును అదే జోన్‌లో జోనల్ కమిషనర్‌గా కొనసాగించారు. జోన్ 6 గాజువాక జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సింహాచలంను అక్కడే జోనల్ కమిషనర్‌గా కొనసాగించారు. జోన్ 8 పెందుర్తి జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లయ్య నాయుడును అక్కడే జోనల్ కమిషనర్‌గా కొనసాగించారు.

అమ్మో.. మూడో తేదీ దాటింది..!

కింద ప్రభుత్వం చెల్లించాల్సివుంది. మంగళవారం నాటికి ఖజానా శాఖ, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.28 కోట్లును జీతాల కింద చెల్లించినట్లు తెలిసింది. మిగిలిన శాఖలకు చెందిన ఉద్యోగులకు రూ.92 కోట్లు జీతాలు చెల్లించాల్సివుంది. రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ వేయలేదు. గత నెలలో రెండున పింఛన్ సొమ్ము జమైనా, ఈ నెలలో మంగళవారం వరకూ బ్యాంకుల్లో జమకాలేదు. జీతాలు పడితే సంక్రాంతి పండుగకు బట్టలు కొందామనుకున్న ఉద్యోగుల్లో నిరాశ వ్యక్తమైంది. పింఛన్లు అందని రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులుపడుతున్నారు. గత నెలలో విద్యాశాఖ ఉద్యోగులకు 26న జీతాలు పడగా, మిగిలిన శాఖలు ఉద్యోగులకు రెండు విడతలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించినట్లు ఉద్యోగులు చెబుతున్నారు.

పింఛన్ పెంపు పేరిట మోసం

రాష్ట్ర విభజన జరిగిన తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రై పెన్షన్‌ను ఒకేసారి ఐదు రెట్లు పెంచి రూ.1000 ఇచ్చారని, 2018 నవంబర్ నుంచి దీనిని రూ.2 వేలు చేశారని గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇచ్చిన దానికి పది రెట్లు పెంచి పెన్షన్ ఇచ్చారన్నారు. అప్పట్లో నిత్యావసర వస్తువుల ధరలు కూడా చాలా తక్కువగా ఉండేవన్నారు. అందువల్ల రూ.2 వేలుతో భరోసా ఉందన్నారు. ఇప్పుడు ఆ భరోసా లేదని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారానికి 642వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే అన్ని రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. జెఎసి ఆధ్వర్యంలో అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది స్టీల్‌ప్లాంట్ గణనీయమైన ఉత్పత్తిని సాధించిందని తెలిపారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు భూములు త్యాగం చేసి, ఈనాటికీ ఉపాధి పొందని నిర్వాసితులందరికీ తక్షణం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో కూర్చున్న వారిలో సంఘం జిల్లా కార్యదర్శి నీరుకొండ రామచంద్రరావు తదితరులు ఉన్నారు.



దీక్షల్లో కూర్చున్న ఐఎన్‌టియుసి నాయకులు

అల్లూరి స్టడీ సర్కిల్‌లో..
త్వరలో గ్రూప్-2 శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎపిపిఎస్‌సి గ్రూప్ - 2కు త్వరలో శిక్షణ ప్రారంభించనున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందస్తుగా http://shorturl.at/my3 లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీలోగా అభ్యర్థులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జనవరి 20 నుంచి తరగతులు మొదలు కానున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8008412798 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఎన్ఎబిబి ఎస్‌డిసిగా జ్ఞానవేణి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా ఎన్ఎబిబి ఎస్‌డిసిగా కె.జ్ఞానవేణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం జిల్లాలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపిఎమ్‌గా ఎంఎస్.కళావతి, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసిగా ఎం.సత్యపద్మ, స్టీల్‌ప్లాంట్ ఎస్‌డిసిగా వెంకట సత్యసాయి రామమోహనరావు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులో గిరిజన సంక్షేమశాఖ ఎస్‌డిసిగా మద్దిపాటి వెంకట రత్న సాయిబాబాను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- అనందపురం : మండలంలోని బీపీ కల్లాలు, పల్లిపేట, మచ్చవానీపాలెం పడాల వారి కళ్ళల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆయా గ్రామాల్లో వ్యవసాయ వ్యవసాయేతర రంగాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మజ్జిపేటలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం మజ్జిపేటలో తాళ్లవలస పిహెచ్‌సి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శోభారాణి, 104 వైద్యులు శివ రామకృష్ణ పాల్గొని 124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా రిసోర్స్ పర్సన్ గోవిందరావు మాట్లాడుతూ, హెచ్ఐవి, టిబి వ్యాధులు ఎలా వస్తాయి?, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ ఎం.జ్యోతి, రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూ పరిసరాల్లో వన సంరక్షణ

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యాన జూ పరిసరాలలో వనసంరక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ ఆధ్వర్యాన 45 మంది వాలంటీర్లు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వన సంరక్షణ ప్రాధాన్యతను ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ప్రకృతి సమతుల్యతకు, కాలుష్య నివారణకు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ అవసరమని తెలిపారు.



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

సింగనబందలో సమగ్ర భూసర్వే

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం సింగనబంద రెవెన్యూ పరిధిలో మంగళవారం భూముల రీ సర్వేను డ్రోన్ కెమెరా సాయంతో నిర్వహించారు. ఈ సర్వేను జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్, వైసిపి నాయకులు గాడు శ్రీను, జి.ఎల్లయ్య, గాడు తాతినాయుడు, నీలాపు సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వాలంటీర్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఆరిలోవ : ఆరిలోవలోని ప్రభుత్వ బాలుర గృహంలో ఉపాధ్యాయ వాలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్షా అదనపు పథక సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్ + డిఎడ్, డిగ్రీ + బిఎడ్ కలిగిన వారు ఈ నెల 6వ తేదీ లోపు చినగదిలి మండల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ వాలంటీర్లు 2 ఖాళీలు ఉన్నాయని ప్రకటించారు. వీరికి నెలకు రూ.7,500 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు : జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-మధురవాడ : ప్రణాళిక ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. జివిఎంసి 8వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్మిస్తున్న పలు భవనాలను పట్టణ ప్రణాళికాధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్లానుకు విరుద్ధంగా నిర్మించే భవనాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్లానులు మంజూరు చేసేటప్పుడు స్థలానికి వెళ్లి ఆయా ప్రాంతాలను పరిశీలించిన తరువాత అన్ని సక్రమంగా ఉంటేనే ప్లాను ఇవ్వాలని చెప్పారు. ఎంవివి గ్రీన్ షీల్డ్ అపార్ట్‌మెంట్, పరదేశిపాలెంలోని అపార్ట్‌మెంట్లను ప్లాన్ ప్రకారం నిర్మిస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. భీమిలి వల్లభా ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ లే-అవుట్‌ను పరిశీలించి రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ తదితరాలు ప్లాన్ ప్రకారం ఉన్నవీ లేనివీ పరిశీలించారు. వంద ప్లాట్లు దాటిన అపార్ట్‌మెంట్లకు చుట్టూ స్థలం, ఎస్టిపి ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం ఆమోదానికి వచ్చిన ప్లాన్లు చాలా జాగ్రత్తగా పరిశీలించి భవనాల నిర్మాణం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి సురేష్, డిసిపి పద్మజ, ఎసిపి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ఎండాడలో ప్లాన్‌ను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

విత్తన శుద్ధితో మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ

ప్రజాశక్తి -తగరపువలస : మొక్క జొన్న పంటకు కత్తెర పురుగు ఆశించకుండా విత్తన శుద్ధి చేయాలని రైతులకు అనకాపల్లి డాట్ కేంద్రం శాస్త్రవేత్త భవాని సూచించారు. భీమిలి మండలం తాటితూరులో మొక్క జొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు సియాన్‌ట్రాని లిప్రోల్, థయామిథాక్సమ్ ద్రావణం 6 మిల్లీ లీటర్లను నీటిలో కిలోవిత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలని సూచించారు. తద్వారా 15- 20 రోజుల వరకు కత్తెర పురుగు ఆశించకుండా మొక్కజొన్న పంటను కాపాడుకోవచ్చని చెప్పారు. వేపనూనెను నీటిలో కలిపి మొవ్వలో పిచికారీ చేయాలని తెలిపారు. దుక్కిలో యూరియా 67 కిలోలు, ఎస్ఎస్‌పి 200 కిలోలు, పొటాష్ 25 కిలోలు వేయాలని, పూత దశలో 67 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. ఈ పర్యటనలో డిఆర్‌సి ఎడిఎ చదువుల సుబ్రమణ్యం, ఎఒ సిహెచ్ సురేష్, భీమిలి ఎడిఎ బొడ్డేపల్లి విజయ ప్రసాద్, ఎఒ బి.శివకోమలి, హబ్ ఎఒ శ్రీకాంత్, విఎఎబి స్వాతి, మొక్క జొన్న పొలంబడి రైతులు పాల్గొన్నారు.

పలుచోట్ల గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -యంత్రాంగం

కంచరపాలెం : జివిఎంసి 55వ వార్డు పరిధిలోని తాటిచెట్లపాలెం, 80 అడుగుల రోడ్డు ప్రాంతంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగా మహేష్, దుప్పలపూడి శ్రీను, కాయిత పైడిరత్నాకర్, యడ్ల సిద్ధార్థ, ఎరంశెట్టి శ్రీను, రాయుడు శ్రీను, నూకరాజు, ఆళ్ళ శ్రీనివాస్, పైడి రమణ, జామి దాసు, జె.శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి జోడుగుళ్లపాలెం, దయాల్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఉమ్మిడి స్వాతిదాస్ ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, స్వాతిదాస్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు అందజేత



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న కార్పొరేటర్ పివి.సురేష్

ప్రజాశక్తి-యంత్రాంగం

ములగాడ : జివిఎంసి 60వ వార్డులో కొత్తగా మంజూరైన 180 పెన్షన్లను లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి.సురేష్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సురేష్ మాట్లాడుతూ, తన వార్డులో కొత్తగా 180 పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురం : వెల్లంకి గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన 20 వృద్ధాప్య పింఛన్లను లబ్ధిదారులకు వైసిపి నాయకులు కాకర వెంకటరమణ మంగళవారం అందజేశారు. నూతనంగా పెంచిన రూ.2750 పెన్షన్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.చంద్రమౌళి, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పడాల రాము, తోణంగి అప్పారావురెడ్డి, చెన్నా సత్యం, బుల్లిరెడ్డి, ఎర్రంశెట్టి అప్పలరాజు, పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్మూర్తి, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంభీరం పంచాయతీలో కొత్తగా మంజూరైన 19 పెన్షన్లను లబ్ధిదారులకు వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మి, ముత్యాలరావు, ఉప్పాడ సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు ముసలయ్య, సత్యవేణి, రమణ, గోవింద్, సెక్రటరీ చలపతిరావు, డిజిటల్ అసిసంట్ దివ్య, నాయకులు నర్సింగరావు, పైడిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెల్లంకిలో పింఛన్ అందజేస్తున్న వైసిపి నాయకులు

నేరాలు ఘోరాలు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి గంజాయితో తిరుగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతిన మలయ్యపాలెంనకు చెందిన రౌడీషీటర్ కరకాని గణేష్ సోమవారం రాత్రి మారికవలస వద్ద గంజాయితో అనుమానంగా తిరుగుతున్నాడు. గస్తీ తిరుగుతున్న ఎస్ఐ విశ్వనాథ్ తన సిబ్బందితో పట్టుకొని విచారించగా అతని వద్ద మూడు కిలోల గంజాయి లభ్యమైంది. గణేష్ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కంచరపాలెం : కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన పట్నాల అశోక్‌కుమార్‌ను విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్‌కుమార్‌ను సత్కరించారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు నరవ పైడిరాజు, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెంపటాపు నూకరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తుంపాల గణేష్, నాయకులు చల్లపల్లి అప్పలరాజు, దేవగుప్త రమేష్, గోవాడ సురేష్ కుమార్, కోడూరు గణపతి రావు, పతివాడ రామకృష్ణ, గులిమి నారాయణరావు, మల్లువలస నారాయణరావు ఉన్నారు.

ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-పెందుర్తి : సిహెచ్ కేంద్రంలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ హేమలత మాట్లాడుతూ, ఆరోగ్య సంబంధిత పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఆశా కార్యకర్తలు మీద ఉందన్నారు. ఆశా కార్యకర్తలు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఫ్లోరైడ్ జిల్లా వైద్యాధికారి సత్యవేణి మాట్లాడుతూ, ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫ్లోరైడ్ వల్ల వచ్చే సమస్యను ప్రజలకు వివరించాలని చెప్పారు.

మసీద్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం ముస్లిం కాలనీ సమీపంలో ఉన్న ఉస్మానియా ఈ మసీద్‌లో కరోనా కారణంగా మూడేళ్లపాటు నిలిచిపోయిన కార్యవర్గాన్ని ఏపీ వక్స్ బోర్డు డైరెక్టర్ షబ్నమ్ అఫ్రోజ్ ఆధ్వర్యాన మంగళవారం ప్రకటించారు. అధ్యక్షునిగా ఎంకెఎం.చిస్టి, కార్యదర్శిగా షేక్ అక్తర్, కోశాధికారిగా షేక్ షరీఫ్, సహాయ కార్యదర్శిగా యూసఫ్ మాలిక్, ఉపాధ్యక్షులుగా షేక్ అల్లా ఉద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎంకెఎం.చిస్టి మాట్లాడుతూ, ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ముస్లిములందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. మసీద్ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ షరీఫ్, ఇఎన్ఎస్ చంద్రరావు, అడ్వొకేట్ సలీం, కరీమ్ ఖాన్, ముస్లిం మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

ఘనంగా గంగమ్మ తల్లి ఉత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యాన మంగళవారం గంగమ్మ తల్లి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హుదూద్, సునామీ, తుపాన్లు రాకుండా ఉండాలని, మత్స్యకార కుటుంబాలను గంగమ్మ తల్లి చల్లగా చూడాలని కోరుతూ మహిళలు పసుపు, కుంకుమ, పాలు, వేపాకులతో కలగలిపిన మిశ్రమాన్ని కళశాలలో వేసి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, వైసిపి మూడో వార్డు ఇన్‌ఛార్జి ఎం.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌బట్

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 2023 పాకెట్ డైరీని సిఎండి అతుల్ బట్ మంగళవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికులకు మరింత ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చాలని సూచించారు. చిన్న చిన్న పొదుపు మొత్తాన్ని జీతం నుంచి ప్రతినెలా సభ్యునికి భారం లేకుండా రికవరీ చేస్తూ సభ్యుడు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంలో పెద్ద మొత్తాన్ని ఇస్తున్న పాలకవర్గాన్ని అభినందించారు. పాకెట్ డైరీ, ఐడి కార్డు పౌచ్‌తో పాటు ఈ ఏడాది సభ్యులందరికీ ఎటిఎం కార్డు పౌచ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.ఆనంద్‌కుమార్, కోశాధికారి శ్రీరామచంద్రమూర్తి, డివిఎస్-ఎస్.కొండరాజు, డైరెక్టర్లు కె.శ్రీనివాస్, ఎంవి.రమణ, లాలూ భూక్య, జివి.రమేష్, గౌతమ్ మహీధర్ పాల్గొన్నారు.



ఎన్నికల అధికారి వివి.శారదారావుకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సిఐటియు ప్యానల్

ఎఫ్‌బిఎస్ ఎన్నికల్లో సిఐటియు ప్యానల్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి-గాజువాక : బెల్ హెచ్‌పివిపి యూనిట్‌లో ఈ నెల 11వ తేదీన జరగనున్న బెల్ హెచ్‌పివిపి ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ మ్యూచువల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ సొసైటీ ఎన్నికల్లో సిఐటియు ప్యానల్‌ను గెలిపించాలని పోటీలో ఉన్న అభ్యర్థులు జి.రాంబాబు, ఎస్ అప్పారావు కోరారు. ఎన్నికల అధికారి వివి.శారదారావుకు మంగళవారం నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, మొత్తం 408 ఓట్లు ఉన్నాయని తెలిపారు.



పార్కుల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

52వ వార్డులో పార్కుల అభివృద్ధి పరిశీలన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డులో ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. జివిఎంసి అధికారులతో కలిసి శాంతినగర్, కరాస, ఉడా లే-అవుట్ గ్రీన్ బెల్ట్ తదితర ప్రాంతాల్లోని పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిపై అధికారులతో సమీక్ష జరిపారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు పార్కులలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం సాధ్యా సాధ్యాలను పరిగణలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్క్స్ ఎఇ సురేష్, వెదుళ్ల శ్రీను, హెల్త్ వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

54వ వార్డులో కెకె.రాజు పర్యటన

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 54వ వార్డులో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు అధికారులతో కలిసి పర్యటించారు. మర్రిపాలెం, మహారాణి వీధి, గొల్ల వీధి ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలపై ఉన్న స్లాబులు విరిగిపోయి తలెత్తుతున్న ఇబ్బందులను కెకె.రాజుకు ప్రజలు వివరించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులతో కెకె.రాజు మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేయించాలని సూచించారు.

జర్నలిస్టుల ఇంటర్ మీడియా స్పోర్ట్స్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్, విస్టా ఆధ్వర్యాన చేపట్టిన ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌ను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మంగళవారం పోర్టు అవుట్ డోర్ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరం సమాజానికి సేవలందించే జర్నలిస్టులు క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం మెరుగుపడటంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రముఖ బాక్సింగ్ కోచ్ మానస మాట్లాడుతూ, జర్నలిస్టుల క్రీడల్లో తనను భాగస్వామ్యం చేయడం సంతోషం కలిగిస్తుందన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఈ క్రీడా సంబరాలు పది రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న మెగా క్రికెట్ టోర్నీలో పలువురు ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తామన్నారు. విస్టా అధ్యక్షుడు ఉమాశంకర్‌బాబు క్రీడల వివరాలు, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్ ప్రారంభంలో భాగంగా తొలుత కమిషనర్ గాలిలోకి బెల్లూన్లు ఎగరవేసి అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలి రోజు నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ హోరాహోరీగా సాగింది. నాలుగు జట్లుగా 44 మంది జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. పురుష, మహిళలకు వంద, రెండు వందల మీటర్ల పరుగుపందం, హైజంప్, లాంగ్ జంప్‌తో పాటు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి దాడి రవికుమార్, ఉపాధ్యక్షుడు, ఆర్.నాగరాజు పట్నాయక్‌లు, సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, దొండా గిరిబాబు, ఎంఎస్ఆర్ ప్రసాద్, పి.దివాకర్, డేవిడ్, పి.వరలక్ష్మి, మాధవరావు, గయాజ్, శేఖర్ మంత్రి, విస్టా ప్రతినిధులు ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పత్రిక ప్రజాశక్తి

వైసిపి 'ఉత్తర' సమన్వయకర్త కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : నిజాలు నిర్భయంగా రాస్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే పత్రిక ప్రజాశక్తి అని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. వైసిపి కార్యాలయంలో మంగళవారం ప్రజాశక్తి నూతన కేలండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ సమస్యలను ఎత్తిచూపుతున్న ప్రజాశక్తి కృషి అభినందనీయమన్నారు. రానున్న కాలంలో ప్రజాశక్తి పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, కంటిపాము కామేశ్వరి, నాయకులు కిరణ్ కుమార్‌రాజు, అంబటి శైలేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు తదితరులు

గుర్తింపు యూనియన్‌పై బురదజల్లడం సరికాదు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఆర్‌టిఐ ద్వారా ఒక యాక్టివిస్ట్ అడిగిన ప్రశ్నకు వేతన సవరణ గురించి తమ దగ్గరకు ప్రపోజల్ రాలేదని కేంద్ర ప్రభుత్వం చెప్పటం శుద్ధ అబద్ధమని, ఈ పేరుతో గుర్తింపుయూనియన్‌పై బురదజల్లడం సరికాదని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ పేర్కొన్నారు. స్పోర్ట్స్ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్‌టిఐని కూడా గుప్పెట్లో పెట్టుకుంటే ఇంకా ఈ దేశానికి, అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి విలువ లేదన్నారు. చట్టాలు చేసిన ప్రభుత్వాలే అబద్దాలు ఆడితే కార్మిక సంఘాలు ఏమి చేయగలవని ప్రశ్నించారు. ఎన్‌జెసిఎస్ సమావేశంలో జ్యోతి రాదిత్య సింధియాకి లెటర్ ఇచ్చిన సంగతి అబద్ధమా, లేక సిఎండి చెప్పినట్లుగా తాము మినిస్ట్రీకి పంపించామని బోర్డు ఆమోదించాలని చెబుతున్న విషయం అబద్ధమా అని ప్రశ్నించారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు వేతన సవరణ కాకుండా తాత్సారం చేస్తూ, ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ చేయాలని దురుద్దేశంతో రకరకాల స్టేట్‌మెంట్లతో గందరగోళానికి గురి చేస్తున్నారని తెలిపారు. డిపిఇ గైడ్ లైన్స్‌కు ఎటువంటి సంబంధం లేని వేతన సవరణను నేడు డిపిఇ గైడ్‌లైన్స్ మీద రుద్దుతోందని చెప్పారు. 1982 చట్ట ప్రకారం కార్మికులకు కంపెనీ లాభనష్టాలతో సంబంధం లేదని, దాన్ని దృష్టిలో పెట్టుకొని వేతన సవరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినిస్ట్రీలో ఉన్న వేతన సవరణ బిల్లును వెంటనే ఆమోదించాలన్నారు.

'యువశక్తి సభను విజయవంతం చేయాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈ నెల 12న జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్వహించే యువశక్తి సభను విజయవంతం చేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోరారు. పౌర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని వైసిపి కబంధహస్తాల నుంచి కాపాడి, నిరుద్యోగ యువతకు దిశా నిర్దేశం చేయడానికి యువశక్తి పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళిత, బీసీ వర్గాలకు ముఖ్యమంత్రి జగన్ అన్యాయం చేసి, సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కాపులకు ఒరిగిందేమిటని ప్రశ్నించారు. జగన్ పరిపాలనా వైఫల్యంతో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటుందని, యువతను గంజాయికి బానిసలను చేస్తున్నారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ జాడలేదని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి గోరంత ఇచ్చి, ప్రజల నెత్తిన కొండంత అప్పుల భారం పెట్టారన్నారు.. వైసిపిపై వ్యతిరేకత వస్తుందని సభలు, సమావేశాలు, ర్యాలీలపై నిషేధం విధించిందని ఆరోపించారు. ఈ సమావేశంలో దూలం గోపి, నాగలక్ష్మి, గండి దుర్గాప్రసాద్, గురు ప్రసాద్, మిడతాన రవికుమార్, దాసరి జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ములగాడ : ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్-2023 కరాటే పోటీల బ్రోచర్‌ను 61వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి సోమేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమేష్ మాట్లాడుతూ, యువత చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ శ్రీను, పోలీస్, సినీ ఆర్టిస్టు, ప్రేమ్ స్వీట్ కవర్ అధినేత శంకర్ ప్రసాద్, బాక్సర్ పిల్లా సాయి, బోధిధర్మ సన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చీఫ్ కోచ్ ప్రకాష్ పాల్గొన్నారు.



కరాటే బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మజ్జి సోమేష్ తదితరులు

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జగదీశ్వరరావు

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : విశాఖ ప్రధాన జిల్లా న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కాండ్రేగుల జగదీశ్వర్‌రావును నియమిస్తూ ఎపి హోం (కోర్ట్స్) డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హెచ్‌కె.గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.



జగదీశ్వరరావుకు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బార్ కౌన్సిల్ మెంబర్లు బైపా కృష్ణమోహన్, నరసింహరావు, వైస్ చైర్మన్ రామ జోగేశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తులసీదాస్ తదితరులు అభినందనలు తెలియజేశారు. నేరస్తులకు శిక్ష పడేలా విధులు నిర్వర్తిస్తానని జగదీశ్వర్‌రావు చెప్పారు. ఈ బాధ్యతల్లో జగదీశ్వరరావు మూడేళ్లు కొనసాగనున్నారు.

'ఉత్తరం'లో కెకె.రాజు గ్రీవెన్స్


ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి పలువురు కార్యాలయానికి వచ్చి సమస్యలతో కూడిన వినతులను కెకె రాజుకు అందించారు. ఈ వినతులను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, కె.కామేశ్వరి, వైసిపి నాయకులు కిరణ్‌రాజు, బలుసు జగదీశ్, ముప్పల పోలారావు, నీలిరవి, అంబటి శైలేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి- కంచరపాలెం : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పాఠశాల విద్యార్థులచే రాజ్యాంగ పీఠికను వివరించి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడ్వకేట్ ఎం నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విశిష్టతపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి, స్కూల్ ప్రిన్సిపల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు రవికిరణ్, జేమ్స్ టీచర్ కరుణ పాల్గొని రాజ్యాంగ విశిష్టతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

పందుల పట్టివేత

ప్రజాశక్తి-భీమునిపట్నం : భీమిలి, తగరపువలస పరిధిలోని పలు ప్రాంతాల్లో పెద్ద, చిన్న కలిపి 32 పందులను జివిఎంసి సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. వాటిని ప్రత్యేక వాహనంలో తరలించారు. ఎఎంఒహెచ్ డాక్టర్ శంకరరావు, సివిఒ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, సూపర్‌వైజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐఒ సత్యనారాయణను సత్కరిస్తున్న రమణాజీ తదితరులు

ఉన్నతస్థాయికి ఎదిగేందుకు చదువే ఆయుధం

- ఆర్ఐఒ సత్యనారాయణ

ప్రజాశక్తి- చోడవరం

జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే చదివే ఆయుధమని, అటువంటి చదువును అశ్రద్ధ చేయవద్దని ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ (ఆర్ఐఒ) ఆర్.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఉషోదయ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఎంతో నైపుణ్యత గల విద్యార్థులు ఉన్నారని, వాటిని వెలికి తీయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం సత్యనారాయణను ఉషోదయ కళాశాల ఛైర్మెన్ జె.రమనాజీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ జె.కృష్ణకుమారి, డీన్ ఎస్‌వి.వాసు, ప్రిన్సిపల్ విఎస్ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.రఘు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి రాజేశ్వరి

తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి

దేవరాపల్లి-తెనుగుపూడి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి మారేపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు కోటి 50 లక్షలతో 2.7 కిలోమీటర్లు మేర ఈ తారు రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లు నుంచి రోడ్డు లేక రైతులు అవస్థలు పడుతున్నారని, ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వైసిపి నాయకులు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వేచలపు అప్పలనాయుడు, గుల్లిపల్లి మురళి, వాలేటి నాగరాజు, చలుమూరి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు హామీ ఇచ్చారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ పెంటయ్య నాయుడుతో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే ఆలయ కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ వారిని ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, అన్నపూర్ణ బ్యాంక్ ఛైర్మన్ పిడి గాంధీ, హైస్కూల్ కమిటీ ఛైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు తర్ర సత్యరావు, జర్రిపోతుల లక్ష్మి, వైసిపి నాయకులు పడాల గణపతి, కనుబుడ్డి శంకర్రావు, ఎరుబండి సత్యనారాయణ, పెంటకోట రాజు తదితరులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు



ఆందోళన చేస్తున్న ఎన్ఎఒబి నిర్వాసితులు

ప్రజాశక్తి-రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారుల నిర్లక్ష్యం తగదని నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి నిర్వాసిత ఎనిమిది గ్రామాల నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం సమీపంలో నేవీ గేటు ముందు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 65వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 65 రోజులుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. 65 రోజుల నుంచి చేపల వేట లేక మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి జెట్టీ నిర్మాణం చేయాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ గుండా చేపల వేటకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం

66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు మూడు రోజులపాటు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల బాలురు బాలికల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన రెండు జట్లను ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్య అధికారి ఆర్.సత్యనారాయణ, షాప్ డైరెక్టర్ జె శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ నిర్వహణ కార్యదర్శి జి రాంబాబు, డైరెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

జిల్లాలో కొత్తగా 6,718 పింఛన్ల మంజూరు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి



పింఛన్ల చెక్కును అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి, కలెక్టర్ రవి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో 2.18 లక్షల మందికి పింఛన్ల డబ్బులు పెంచడంతో పాటు 6,718 కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం పెంచిన పింఛన్ చెక్కులను శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మి రామకృష్ణతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,43,141 మంది వృద్ధులు, 60,337 మంది వితంతువులు, 5,780 మంది ఒంటరి మహిళలు, 3,265 మంది మత్స్యకారులు, 2,623 మంది చేనేత పనివారు, 2,328 మంది కల్లు గీత కార్మికులు, 1057 మంది సాంప్రదాయ చర్మకారులకు పింఛన్ పెంపు వర్తించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల వాణి, డిఎల్‌డిఓ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - కశింకోట

మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్య కేంద్రం ఆధ్వర్యంలో తీడ గ్రామంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద శిబిరం, యోగా శిక్షణ మంగళవారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు యోగా నేర్పించారు. అనంతరం ఆయుర్వేద లేహ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తీడ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచి ఆహారం అలవాట్లు కలిగి ఉండాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య అధికారి కోనాడ లావణ్య, సిబ్బంది రజనీ, యోగా శిక్షకుడు రెడ్డి శ్రీనివాస్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేద లేహ్యం పంపిణీ చేస్తున్న హెచ్ఎం శ్రీదేవి తదితరులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పిడి

రాష్ట్రస్థాయి పోటీలకు చిన దొడ్డిగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి

మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం వై.అప్పారావు, పీడీ దేముళ్ళ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల 31న వేములపూడిలో నిర్వహించిన పోటీలలో పదో తరగతి విద్యార్థి ఎస్. సాయిజ్యోతి ఉత్తమ ప్రతిభ కనబర్చి సీనియర్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. 8వ తరగతి విద్యార్థి పి.ఎజిత్ అఖిల్ అండర్ -14 జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులను మంగళవారం హెచ్ఎం అప్పారావు, పీడీ దేముళ్ళ,ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఏప్రిల్ 29న నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ ఏడాది ఏప్రిల్ 29 ఉదయం 11.30 గంటల నుంచి నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022- 23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదివిన విద్యార్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు. 2011 మే 1 నుంచి 2013 ఏప్రిల్ 30వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆన్లైన్ ద్వారా దిగువ తెలిపిన వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. https://navodaya.gov/nvs/ro/hyderabad/en/admission/admission:notification అడ్రస్ కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనకాపల్లి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

మంత్రికి మాజీ ఎమ్మెల్యే పీలా సవాల్

ప్రజాశక్తి-అనకాపల్లి

గడచిన మూడున్నర సంవత్సరాల్లో అనకాపల్లిలో జరిగిన అభివృద్ధిపై రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ సవాల్ విసిరారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బవులవాడ గ్రామం దర్జీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమన్నారు. మంత్రి అమర్‌నాథ్‌కు చేతకాకే వైద్య కళాశాల అనకాపల్లి నుంచి నర్సీపట్నం తరలిపోయిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్, కోట్ని ఈశ్వరరావు, చొప్ప రమణ, బత్తుల లక్ష్మి రమేష్, వార్డు సభ్యులు రెహమాన్, మోటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా, టిడిపి కార్యకర్తలు


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

నిషేధ జీవోలు ప్రతిపక్ష పార్టీలకేనా?

ప్రజాశక్తి -అనకాపల్లి

రోడ్లపై ర్యాలీలు, సభలు నిర్వహించరాదని జగన్ రెడ్డి ప్రభుత్వం విధించిన నిషేధ జీవోలు ప్రతిపక్ష పార్టీలకేనా అని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ విధించని నిషేధ ఆంక్షలు ఆంధ్ర ప్రదేశ్‌లో వైసిపి ప్రభుత్వం విధిస్తూ నియంతృత్వ పోకడలకు, ఫాసిస్టు విధానాలకు తెర లేపిందని ఆరోపించారు. చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక నామమాత్ర పోలీసు సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినా ప్రేక్షక పాత్ర వహించిందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పలు సంఘటనల్లో 173 మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు ఈ జీవోలు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటిలా జీవోలు జారీ చేసి ఉంటే జగన్ పాదయాత్ర జరిగేదా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి కాశీ నాయుడు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శక్తిప్రియ

గర్భిణుల యాప్‌పై ఆశా వర్కర్లకు అవగాహన

ప్రజాశక్తి -ఎస్ రాయవరం

మండలంలోని సర్వసిద్ధి పిహెచ్‌సిలో డాక్టర్ శక్తి ప్రియ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు కిల్కారి అనే యాప్ గురించి శిక్షణనిచ్చారు. ప్రతి గర్భిణి ఈ యాప్ ఉపయోగించే విధంగా చర్య చేపట్టాలన్నారు. నాలుగు నెలల గర్భిణులు నుంచి బిడ్డ పుట్టి వారికి పదినెలలు వచ్చే వరకు ఈ యాప్ ద్వారా అనేక సేవలు గర్భిణులు, బాలింతలకు పలు సేవలు అందుతాయన్నారు. ఎప్పటికప్పుడు పలు రకాల ఆరోగ్య సూచనల కోసం కాల్స్ వస్తాయన్నారు. ఆ సూచనలు పాటిస్తే తల్లి బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు ఈ యాప్ యొక్క వివరించి అర్థమయ్యే విధంగా గర్భిణులు, ఆశ వర్కర్లు తెలియ చెప్పాలని డాక్టర్ శక్తి ప్రియ సూచించారు.. అనంతరం ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పిహెచ్‌సి సిబ్బంది అందరూ కలిసి డాక్టర్ శక్తి ప్రియకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సిఎం దృష్టికి 108 సిబ్బంది సమస్యలు

ప్రజాశక్తి-గొలుగొండ

తమ సమస్యలు పరిష్కరించాలని 108 సిబ్బంది మంగళవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళతామని హామీనిచ్చారు.. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, 108 రాష్ట్ర ట్రెజరర్ మల్ల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు జిటిఎస్.ప్రసాద్, అంబులెన్స్ స్టాఫ్ ఎం.అప్పారావు, తేజస్విని, ఎస్‌వి.రమణ, రామ్మోహనరావు, బాలకృష్ణ, శంకర్‌రావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఉమాశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న 108 సిబ్బంది

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ


సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం శ్రీధర్, యుటిఎఫ్ నేత చిన్నబ్బాయి

ప్రజాశక్తి -యంత్రాంగం

అట్టడుగు వర్గాల, మహిళలకు చదువు, సంపద తదితర హక్కుల కల్పనలో ఎంతో కృషి చేసిన సావిత్రి భాయి పూలే జయంతిని మంగళవారం జిల్లాలో పలు చోట్ల నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో సావిత్రి భాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఆమె స్ఫూర్తితో బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరావు, జి.రవి, ఎం.మహాలక్ష్మి, సోమయాజులు, షేక్ అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.రాజేశ్వరి, ఆర్.త్రివేణి, సత్యవతి, అనురాధ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ శ్రీ విశ్వకర్మ భగవాన్ కార్పెంటర్ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి పార్వతీశం ఆచారి, ఉపాధ్యక్షులు శివప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కురుమోజు గోవిందరావు, శ్రీమంతుల వీరాచారి, మండా రమేష్, గోల్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలస ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని నిర్వహించారు. వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సుభాషిని, అంగన్వాడి టీచర్ నదియాలను సన్మానించారు.

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. జాతీయ సేవా పథకం కార్యకర్తలకు, విద్యార్థులకు సావిత్రిబాయి పూలే జీవితంపై క్విజ్‌ను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఐపిఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, ఎన్.నదియా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ పాల్గొన్నారు.

శ్రీహరిపురం జీవీఎంసీ హైస్కూల్‌లో రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు కోరుకొండ పద్మ ఆధ్వర్యాన జయంతి నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైసిపి నాయకులు పెదిరెడ్ల నానాజీ ముఖ్య అతిథులుగా హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఏయూ పరిపాలనా భవనంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి వీసి ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య సుదర్శనరావు, పితాని ప్రసాద్, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

గాజువాక : సుందరయ్య కాలనీలోని రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్లో సావిత్రీబాయిపూలే జయంతిని నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్‌వికె.పరశురామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచరపాలెం : బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న టైలరింగ్ తరగతి సెక్షన్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, నగర మహిళా నాయకులు బి.పద్మ, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పెంటకోట రామారావు, టైలరింగ్ టీచర్ పి సావిత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ, భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రిగా ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.

ఎంవిపి.కాలనీ : భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని మంగళవారం మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల మహిళా అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బిసి కమిషన్ సభ్యులు పక్కి దివాకర్, కార్పొరేషన్ ఛైర్మన్ చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి రవి రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సతీష్ వర్మ, కొండా రాజీవ్ గాంధీ, బిసి విభాగం అధ్యక్షులు కె.రామన్నపాత్రుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్త్రీ విద్య నిషేధించబడిన 18వ శతాబ్దంలో జ్యోతిరావు పూలే సహకారంతో ఆయన భార్య సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్న అబ్బాయి అన్నారు. పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. బాలికల కోసం ఆమె ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు రాజు, అనిరోజ్, లక్ష్మి, ఉమా, పట్టాభి, సంతోషి, విజయలక్ష్మి, స్వామి, గౌరి, కామేశ్వరరావు, బాల సరస్వతి, గోపి, సౌజన్య పాల్గొన్నారు.

స్థానిక ఎంపీ డాక్టర్ సత్యవతి క్యాంపు కార్యాలయంలో బీసీ సీమాంధ్ర సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి ఎంపీ సత్యవతి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాల సావిత్రిబాయి పూలే విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ జయ బాబు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైస్ ప్రిన్సిపల్ మహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా కె.కోటపాడు ఎంఈఓ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి మండల విద్యాశాఖ అధికారి టి.మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే ఉపాధ్యాయురాలిగా, రచయితగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేశంలో స్త్రీల విద్యకు మొట్టమొదటిసారిగా బాటలు వేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలేనని ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలోని ఎంపిపి పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలు సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎంపిపి రాజేశ్వరితో పాటు పలువురు పూలమాలలువేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ, పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ రామారావు పాల్గొన్నారు.

వడ్డాది : వడ్డాది అక్షర స్కూల్‌లో కరెస్పాండెంట్ తగరం పూడి వరప్రసాద్ సావిత్రి బాయ్ పూలే చిత్ర పటానికి పూల మాల వేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 175 సంవత్సరాల క్రితం నిమ్న కుల బాలికల విద్యా గురించి ఆలోచించి పాఠశాలను స్థాపించిన మహిళ సావిత్రిబాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న ఎంపిపి రాజేశ్వరి, అప్పారావు, రమణ తదితరులు


కార్యక్రమంలో పాల్గొన్న కె.కోటపాడు ఎంఇఒ మధు

గండి ప్రదేశంలో కాంక్రీట్ పనులు

ప్రజాశక్తి -సీలేరు : డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి పడిన ప్రదేశంలో కాంక్రీట్ పనులు సోమవారం రాత్రి 10 గంటల నుంచి ప్రారంభించినట్లు ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కేవీ. ప్రశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొదటిగా గండి పూడ్చివేత పనులు పూర్తి చేయడానికి గ్రావెల్‌తో మట్టి పనులు చేపట్టామని, ఈ పనులు సుమారు 20 రోజులు జరిగాయని తెలిపారు. మట్టి పనులు పూర్తి కావడంతో కాంక్రీట్ పనులు చేపట్టామన్నారు. ఇంజనీర్లు పర్యవేక్షణలో నాణ్యత లోపాలు తలెత్తకుండా నిరంతరం పరిశీలిస్తూ పనులు చేపడుతున్నామని తెలిపారు. కెనాల్ లోపల వైపు భాగం కాంక్రీట్ పనులు పూర్తి చేశామని, మరో నాలుగు రోజుల్లో కెనాల్ గండి అవుట్ సైడ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పవర్ కెనాల్ పనులు పూర్తయిన వెంటనే కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా నీటిని నెమ్మది నెమ్మదిగా విడిచి పెడుతూ గోదావరి డెల్టాకు 1000 నుంచి 2000 క్యూసెక్కులు నీటి విడుదల పెంచుతూ 4000 క్యూసెక్కుల వరకు నీటి విడుదల చేస్తామని తెలిపారు.

కార్మికులకు క్యారేజీల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మూలపేట గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులకు క్యారేజీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటియూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ భవన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సహజ, ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిన్ని చిన్న, కోశాధికారి శీర అప్పలరాజు, సహాయ కార్యదర్శి మారేడుపూడి సత్యనారాయణ, పల్లా నరసింహారావు, ఉప్పులి సత్తిబాబు పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి జగన్

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
పింఛన్ల పంపిణీలో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు గణేష్, ధర్మశ్రీ, బాబూరావు



అనకాపల్లిలో పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను వైసిపి ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. పట్టణంలోని ఐదు నుంచి ఏడు సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను, మండలంలోని తుమ్మపాల బంగారు రాజు కళ్యాణ మండపంలో పెంచిన పింఛన్లు, నూతన పింఛన్లను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వెయ్యి రూపాయల పింఛన్ ఉంటే తమ ప్రభుత్వం విడతల వారీగా నేటికీ రూ.2,750కు పెంచిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 38 లక్షలు మంది పింఛన్‌దారులు ఉండగా నేడు 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్ జాజుల ప్రసన్న, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకి రామరాజు, పలక రవి, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, తుమ్మపాల సర్పంచ్ పెంటయ్య నాయుడు, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పిడి గాంధీ, వైస్ ఎంపీపీ సూర్య కుమారి శేఖర్, ఎంపిటిసీలు పంచదారల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.


కశింకోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కొత్తగా మంజూరైన పింఛన్లును మంత్రి అమర్‌నాథ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి పెద్దగా ముఖ్యమంత్రి జగన్ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, జయరజనీ, ఉప్పునూరు మాణిక్యం, గొల్లివిల్లి శ్రీనివాసరావు, ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు, మండల సమాఖ్య ఎపిఒ ఎమ్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, పలుశాఖలు అధికారులు పాల్గొన్నారు.

చోడవరం : అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన 1269 పింఛన్లను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం 45,485 పింఛన్లు ఉన్నాయన్నారు. ఎంపీడీవోలు ఎసిడి శ్యామసుందర్, వెంకన్న బాబు, జడ్పిటిసి దొండ రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసులమ్మ, వైసిపి నాయకులు బి సూర్యనారాయణ, పళ్ళ నర్సింగరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఐతెంపూడిలో లబ్ధిదారులకు సర్పంచ్ పెద్దాడ నాయుడు బాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మచ్చకర్ల మహాలక్ష్మి నాయుడు, అయితిరెడ్డి రమణ, మచ్చకర్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : దశలవారీగాపింఛన్లు మొత్తాన్ని పెంచి లబ్దిదారులకు ఇస్తామన్న మాటను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుకగా నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుకలో భాగంగా కొత్తగా మంజూరైన పింఛన్లతోపాటు ఇప్పటికే ఉన్న లబ్దిదారులకు పెంచిన పింఛను పంపిణీని ప్రారంభించారు. నర్సీపట్నం నియోజవర్గంలో 1364, మండలంలో 151 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని, దీంతో ఇప్పటివరకు వైసిపి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 8530 కొత్త పెన్షన్లు మంజూరు చేసామన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 90 దేవాలయాలకు టిటిడి నుంచి రూ.9 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి వైస్ఎంపిపి ఇన్నం రత్నం మండలం లో సర్పంచులు ఎంపిటిసిలు ఎంపిడిఒ జయ మాధవి పాల్గొన్నారు.

మాకవరపాలెం: పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వం పథకాలు అందజేస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలంలో కొత్తగా 358మందికి కొత్త పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, ఎంపిడిఒ అరుణశ్రీ,జెడ్‌పిటిసి పెట్ల సత్యవేణి,మండల పార్టీ అధ్యక్షుడు రుత్తుల వాసు. భద్రాచలం పాల్గొన్నారు.



చోడవరంలో పింఛను అందజేస్తున్న ధర్మశ్రీ

రావికమతం : పార్టీలకు, వర్గాలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు కోరారు. మంగళవారం కవగుంట రామాలయం వద్ద కొత్త పింఛన్లు పంపిణీని ప్రారంభించారు. గ్రామపంచాయతీలో 170 పెన్షన్లు ఉండగా కొత్తగా మంజూరైన 12 పెన్షన్లతో కలుపుకొని ప్రస్తుతం 182మందికి పింఛను లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రగడ నాగేశ్వరరావు, బీర పద్మ , చంద్రన నాయుడు, రొబ్బా వరకుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ నాయుడు బాబు, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

కోటవురట్ల : ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు మంగళవారం మండల సమావేశం మందిరంలో కొత్తగా మంజూరైన 275 పింఛన్ల మంజూరీ పత్రాలు లబ్దిదారులకు అందజేశారు ఎంపిపి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య, జెడ్‌పిటిసి సభ్యురాలు ఉమాదేవి, వైస్ ఎంపిపి దత్తుడు రాజు, ఎంపిడిఒ చంద్రశేఖర్, తహశీల్దార్ జానకమ్మ, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చందనాడ గ్రామంలో వైసిపి నాయకులు తళ్ళ భార్గవ్ కొత్తగా మంజూరైన 19 పింఛన్లును లబ్ధిదారులకు అందజేశారు కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబూరావు, ఉప సర్పంచ్ గోవింద్, అప్పలస్వామి పాల్గొన్నారు .



మాకవరపాలెంలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్



నక్కపల్లిలో పింఛన్ల పంపిణీలో వైసిపి నేతలు

నిబంధనలకు వ్యతిరేకంగా చెట్లు వేలం

ప్రజాశక్తి- మాడుగుల : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలోని చెట్లను నిబంధనలకు వ్యతిరేకంగా వేలం నిర్వహించారని మాడుగుల పట్టణ టిడిపి అధ్యక్షులు రంజిత్ వర్మ ఆరోపించారు .వేలం వేస్తున్నట్లు పత్రికా ప్రకటన, దండోరా వేయాలని, కానీ ఇవి జరగకుండా టేకు, నేరేడు వంటి విలువైన కలప కేవలం రూ.లక్షకు తమకు అనుకూలమైన వ్యక్తికి అప్పగించారని ఆరోపించారు .దీని వలన సొసైటీకి రావాల్సిన అదనపు ఆదాయానికి నష్టం వాటిల్లిందన్నారు. సొసైటీ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగిన లాలూచీపై అధికారులు స్పందించాలని కోరారు

గడపగడపకూ ఎమ్మెల్యే బాబూరావు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని రేవుపోలవరం గ్రామంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మంగళవారం గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మత్స్యకారుల కోసం ఎన్నో పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని, మున్ముందు మరిన్ని కొత్త పథకాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్రమూర్తి , స్థానిక అధికారులు, డిప్యూటీ తాసిల్దార్ వెలుగు సిబ్బంది ఎపిఎం, ఎన్ఆర్‌జిఎస్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పలు గ్రామాల సర్పంచులు, వైసిఇ కార్యకర్తలు మాతా గురునాధరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



. ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి-గొలుగొండ : దేశంలోనే విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తున్నారని జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు అన్నారు.మంగళవారం మండలంలోని చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావ్యవస్థకు వైసిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు.. నాడు నేడు పథకం, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన వంటి కార్యక్రమాల ద్వారా పేదలు విద్యావంతులను చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహిన్ని అందిస్తోందని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, పత్తి రమణ, నల్లబెల్లి శ్రీను, సర్పంచ్ తోకల సంతోష్, పాఠశాల హెచ్ఎం రత్నాజీ, విద్యా కమిటీ చైర్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

11న ఎంఆర్‌పిఎస్ సమావేశం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : ఈనెల 11వ తేదీన బెంగళూరులో జరగబోయే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సమావేశానికి పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి ఏలుసూరి గాటీలు మాదిగ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల ప్రతినిధులు బెంగళూరు సమావేశానికి తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కొల్లి చిన్న అప్పారావు మాదిగ మాట్లాడుతూ, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఉమ్మడి జిల్లా కమిటీని ఏర్పాటు చేశామని,నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా చిందాడ లోకేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా ఎ. రాజుబాబు, మున్సిపాలిటీ ఇన్‌ఛార్జిగా మారెపూడి సతీష్ మాదిగలను నియమించామన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల. : సమగ్ర భూసర్వే అనంతరం మండలంలోని పలు గ్రామాలలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. వీరవల్లి అగ్రహారం, గాదిరాయి తదితర గ్రామాలలో.సర్వే అనంతరం రైతులకు పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేసిన ఎంపిపి పెదబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో సమగ్ర భూసర్వే నిర్వహించి, రైతుల భూహక్కులను నిర్ధారించి, అందరికీ పట్టాల పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమం తహసిల్దార్ పివి రత్నం, డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, వైసిపి నేతలు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఎంపిపి పెదబాబు

కొత్తపట్నంలో కుక్కల గుంపు హల్‌చల్!

వీధి కుక్కల దాడిలో గేదె పెయ్యి, నాటుకోళ్లు మృత్యువాత

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం జెడ్. కొత్త పట్నం గ్రామంలో మంగళవారం వీధి కుక్కల దాడిలో ఆరు నెలలు వయస్సు గల గేదె పెయ్యితోపాటు అనేక నాటు కోళ్లు మృతి చెందాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి చెందిన రుత్త పెద్ది రాజు గ్రామ సమీపంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా, పాక బయట కట్టిన గేదె పెయ్యిపై వీధి కుక్కల గుంపు మూకుమ్మడి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన దూడ అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే మరో ఇద్దరు రైతులు గాలి తాతాజీ కి చెందిన సుమారు రూ. 3 వేలు విలువైన ఆరు నాటు కోళ్లపై కుక్కలు దాడి చేయడం తో మృత్యువాత పడ్డాయి. రుత్తల అప్పలనాయుడుకు చెందిన మరో గేదె పెయ్యిని కుక్కలుతీవ్రంగా గాయపరిచాయి. గత వారంరోజులుగా జెడ్.కొత్తపట్నంలో వీధి కుక్కల గుంపు దాడులతో మూగజీవాలు మృత్యువాత పడుతూ, పెంపకందారులకు నష్టాన్ని చేకూరుస్తున్నాయని స్థానికులు అంటున్నారు. .దీనిపై పంచాయితీ కార్యదర్శి పోలిరెడ్డిని వివరణ కోరగా కుక్కల నివారణకు పశుసంవర్ధక శాఖ అనుమతి కోసం రైతులు వినతిపత్రం మేరకు సిఫార్సు చేస్తామని తెలిపారు.



కుక్కల దాడిలో
మృతి చెందిన గేదె పెయ్యి

పిఆర్‌టియు కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎఇఒ సాయి శైలజ ఆధ్వర్యంలో పిఆర్‌టియు కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సాయి శైలజ కు పలువురు ఉపాధ్యాయులునూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు వరహాలనాయుడు, సెక్రటరీ జివి.రమేష్, వైస్ ప్రెసిడెంట్ కె సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పెన్షనర్లు..
లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి నెలఖారులోగా ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలని పెన్షన్‌దారుల సంఘం డివిజన శాఖ అధ్యక్షులు వి గజ్జలమ్మ మంగళవారం విలేకరులకు తెలిపారు.నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకుంటే పెన్షన్ నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అనారోగ్య కారణంగా ఇంటికి పరిమితమైన పెన్షన్‌దారులు వద్దకు సబ్ ట్రెజరీ సిబ్బంది వచ్చి నమోదు చేస్తారన్నారు. ఈ విషయాన్ని గ్రహించి ప్రతిఒక్కరూ త్వరతిగతిన లైఫ్ సర్టిఫికెట్లు దాఖలు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లు నమోదు ఆధార్ నెంబర్, పెన్షన్‌బుక్‌తోపాటు, అనుసంధానించిన మొబైల్ ఫోన్‌తో వెళ్లాలని సూచించారు.

వాయిద్య కళాకారునికి సత్కారం



సన్మానం అందుకుంటున్న నారాయణరావు

ప్రజాశక్తి -మాడుగుల : మండల కేంద్రం మాడుగులకు చెందిన ప్రముఖ వాయిద్య కళాకారుడు పే లూరి వెంకటనారాయణరావుకు యానాం దరి గుత్తిందీవి వద్ద మంగళవారం ఘన సన్మానం జరిగింది ముక్కోటి ఏకాదశి సందర్భంగా .సోమవారం భక్తి పాటలు కార్యక్రమంలో పాల్గొనగా, ఆయనకు మంగళవారం ప్రత్యేక సన్మానం చేశారు .ప్రముఖ వాయిద్య కళాకారుడు సాంబమూర్తి కుమారుడు అయిన నారాయణరావు కూడా క్లారినెట్, సాక్సా ఫోన్‌తో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గా మంచి గుర్తింపు పొంది పలు రాష్ట్రాలలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈయన పలువురు విద్యార్థులకు సంగీత ప్రక్రియల్లో శిక్షణనిచ్చి తీర్చిదిద్దుతున్నారు. మాడుగుల కళాకారునికి పుదుచ్చేరి రాష్ట్రంలో సన్మానం పట్ల పలువురు అభినందనలు తెలిపారు

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు
'శ్రీప్రకాష్' విద్యార్థులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి -పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేములపూడి జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్‌లో అండర్-14, అండర్ 17 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికల ప్రక్రియలో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.అండర్ 17 విభాగంలో బి. యామిని (10 వ తరగతి), కే.భువనకతి(10 వ తరగతి), అండర్ -14 విభాగంలో ఆర్.లోకేష్ (8వ తరగతి), యల్ దిలీప్‌కుమార్ (9వ తరగతి), కే హరి గాయత్రి (9వ తరగతి), ఎస్. సింధు (7వ తరగతి)ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు డివి శ్రీనివాస్ తెలిపారు. వీరు కాకినాడ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖపట్నం జిల్లా తరుపున ఆడనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, జిల్లాసాయి పోటీల్లో రాణించినట్లుగానే రాష్ట్ర పోటీల్లోనూ సత్తా చాటి ఈ ప్రాంతానికే కాకుండా తమ పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ ఎం వివిఎస్ మూర్తి, కోచ్ శివాజీ తదితరులు అభినందించారు.

సిఐటియు రాష్ట్ర మహాసభలో
విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రతినిధులు



గ్రూపు చర్చలు జరుపుతున్న విశాఖ జిల్లా ప్రతినిధులు



గ్రూపు చర్చలు జరుపుతున్న అనకాపల్లి జిల్లా ప్రతినిధులు

భీమవరంలో తలపెట్టిన సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతోంది. కార్యదర్శి నివేదికపై మంగళవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వేదిక పైనుంచి రిపోర్టు చేశారు. కార్మిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన పోరాటాలపై రోజంతా చర్చ సాగింది.





విశాఖ జిల్లా నుంచి మాట్లాడుతున్న జగన్, సీతామహాలక్ష్మి





అనకాపల్లి జిల్లా నుంచి మాట్లాడుతున్న శంకరరావు, నాగేషు

నిరాశ్రయులకు 780 కిలోల బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'గుప్పెడు బియ్యం' పథకంలో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీలోని బలిఘట్టం కొండ ప్రాంతంలో నిరాశ్రయులకు ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం చొప్పున 780 కేజీల బియ్యాన్ని, చిన్నపిల్లలకు 50 బ్రెడ్ పాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్.కష్ణ ప్రారంభించారు. కార్యక్రమ నిర్వాహకులు కామర్స్ అధ్యాపకులు నానాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే యువతకు తోటివారికి ముఖ్యంగా పేదలకు సహాయం చేయాలనే ఆలోచన, దృక్పథం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు వి.రమేష్, టి. లోవరాజు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాన్ని చేపట్టిన నానాజీ, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు పలువురు అభినందించారు.

ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు
గాడి తప్పిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం ?



నర్సీపట్నంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ విభాగం గాడీ తప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడచూసినా అనుమతి లేని నిర్మాణాలు, ఇంటి ప్లాన్‌ల ముసుగులో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కమర్షియల్ నిర్మాణాలు పట్టణంలో విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి ముఖ్య కారణం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలోపమేనని పలువురు అంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారి సరిగా ఉండకపోవడమేనని అంటున్నారు. మున్సిపాలిటీలో పెరిగిపోతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కౌన్సిలర్లు సమావేశంలో పలు మార్లు హెచ్చరించినప్పటికీ అధికారుల తీరు మారలేదు. మున్సిపాలిటీ స్థలాల్లో ఎక్కడా హెచ్చరిక బోర్డులు పెట్టిన దాఖలాలు లేవు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోరు. విలువైన భూములు అక్రమార్కుల చెరలోకి వెళ్తున్నప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. శారదా నగర్ నుండి బలిఘట్టం బైపాస్ వెళ్లే ప్రధాన రహదారిలో నర్సీపట్నం నుండి డిగ్రీ కాలేజ్ వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఎటువైపు చూసినా దర్జాగా అక్రమ షాపులు నిర్మాణం చేయడం కాకుండా, పలుచోట్ల అనుమతుల్లేకుండానే అధిక అంతస్తులు అక్రమంగా నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు జేబులు నింపితే చాలు ఎన్ని అంతస్తులైనా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించుకోవచ్చనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత విభాగం అధికారులు ఇప్పటికైనా స్పందించి, నర్సీపట్నంలో అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. .

డ్రైయినేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న రాజబాబు, చిన్నమ్మలు

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని జెబి.పురం గ్రామ పంచాయతీలో రూ.18 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీనిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ గొల్లవెల్లి చిన్నమ్మలు ఆధ్వర్యంలో వైసిపి మండల అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు శంకుస్థాపన చేశారు. జెబి.పురంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దృష్టికి మురుగుకాలువల సమస్యను తీసుకెళ్లగా, రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారని, అదనంగా మంజూరైన మరో రూ8లక్షలు కలుపుకుని రూ.18 లక్షలతో రడైనేజీ పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్లుఎస్ ఎఇ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

ఆర్‌బికె నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

ప్రజాశక్తి -రోలుగుంట : మండలంలోని బిబి.పట్నం గ్రామంలో సర్పంచ్ జి.ఈశ్వరరావు ఆధ్వ్యంలో రైతు భరోసా కేంద్రం పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపడుతున్నామన్నారు. రైతులకు ఉపయోగపడే అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాలలో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.